




సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

నిర్మలమ్మ.. ఇటు చూడమ్మ..!



కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బుధవారం నాడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యత లభిస్తుందోనని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. గడచిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి చెప్పకోదగ్గ కేటాయింపులూ చేయలేదు. జిల్లా వాసులు ప్రతిసారీ బడ్జెట్‌పై ఆశలు పెట్టుకోవడం తరువాత ఉసూరుమనడం పరిపాటి అయ్యింది. ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు న్యాయం చేసేలా కేటాయింపులు ఉండాలని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.

- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి 'అనంత'కు చోటు లభించేనా.?
- విభజన హామీల అమలు అంతంత మాత్రమే
- రైల్వేకు నిధులూ అరకొరే
- కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి



2022లో నాసిన్‌కు సంబంధించి 2వ సారి భూమిపూజ చేసిన పనులు ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్(ఫైల్‌ఫొటో)



గుంతకల్లు రైల్వేజంక్షన్ పోలీసు స్టేషన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన అనంతరం కేంద్రం అనేక హామీలను ఇచ్చింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి అనేక వాటికి నిధులను మంజూరు చేయాల్సి ఉంది. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివృద్ధికి సంబంధించి కేటాయింపులు నిరాశనే మిగులుస్తూ వస్తున్నాయి. రైల్వే, విభజన హామీల అమలు దేనికైనా ఇదే రకంగా ఉంటున్నాయి. రాష్ట్ర విభజన జరిగి దశబ్ధకాలం పూర్తవుతున్నా విభజన హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

విభజన హామీలు

విభజన హామీల్లో ఒకటైన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటై ఐదేళ్లు కావస్తున్నా పూర్తి స్థాయిలో ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికీ శాశ్వత భవనాలే లేవు. తాత్కాలిక భవనాలు, అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు కనీసం వసతి గృహ సౌకర్యం కూడా సరిగా లేదు. విద్యార్థులు తరచూ ఈ సమస్యలపై ఆందోళనలు వ్యక్తం చేయడం పరిపాటిగానే మారుతోంది. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద స్థల కేటాయింపులు జరిగినా శాశ్వత భవన నిర్మాణాలకు నిధుల కేటాయింపులు ఆశించినంత జరగలేదు. కేటాయింపులు జరిగినా నిధులు మంజూరవలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లోనైనా కేంద్రీయ విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయిలో నిధుల కేటాయింపులు జరుగుతాయా.? లేక ఎప్పటిలాగానే మొక్కుబడి నిధుల కేటాయింపులే జరుగుతాయా.? అన్నది చూడాల్సి ఉంది. ఇక నాసన్ సంస్థకు 2015లోనే శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభమవలేదు. తాజాగా 2022లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ వచ్చి శంకుస్థాపన చేశాక పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదికైనా దీని నిర్మాణ పనులు పూర్తి స్థాయి అవుతాయా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది. మరో సంస్థ 'బెల్'కు 2015 సెప్టంబరులో శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఇది ప్రహరీ నిర్మాణానికే పరిమితమైంది. ఈ ఏడాది ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. కాని పూర్తి స్థాయి పనులు ఎప్పటికి ప్రారంభం అవుతాయో తెలియని పరిస్థితి ఉంది.

రైల్వే నిధుల కేటాయింపులు పెరిగేనా.?

ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ప్రాధాన్యత కలిగిన గుంతకల్లు డివిజన్ అనంతపురం జిల్లాలోని గుంతకల్లులో ఉంది. ఇటు ఉత్తర భారతానికి, ఇటు దక్షిణ భారతదేశానికి కలిపే కీలకమైన డివిజన్ గుంతకల్లు. ఈ డివిజన్‌కు నిధుల కేటాయింపులు మొదటి నుంచి అరకొరగానే ఉంటున్నాయి. గత కొన్నేళ్లుగా కొత్త రైలు ఒక్కటీ దీని పరిధిలో వేయలేదు. ప్రకటిచిన రైల్వేలైన్లే దశాబ్దాలుగా నడుస్తూనే ఉన్నాయి. రాయదుర్గం-తుంకురు, కడప-బెంగళూరు, డోన్-గుంటూరు డబ్లంగ్ ఇలా అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. వీటికి ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయింపులు పెంచి పనులు పరుగులు పెట్టిస్తారా.? లేక ఎప్పటిలాగానే అరకొర కేటాయింపులతో నత్తనడకన నడిపిస్తారా అన్నది చూడాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వాసులు మాత్రం ఈ సారైనా కేంద్రం నిధుల విడుదలలో కనికరం చూపకపోతుందా అని గంపెడాసతో ఎదురుచూస్తున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు సిబ్బంది, వాలంటీర్లు కృషి చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. మంగళవారం నాడు ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌సికె పురం, పార్థసారథి నగర్-1, పార్థసారథి నగర్-2 వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహశీల్దార్ యోగేశ్వరీదేవితో కలిసి తనిఖీ చేశారు. సచివాలయాలలో ఏర్పాటు చేసిన సేవలకు సంబంధించి బోర్డులను పరిశీలించారు. సచివాలయం సిబ్బంది ప్రతి ఒక్కరూ డ్రెస్ కోడ్ ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. సాయంత్రం వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. స్పందన వినతులు స్వీకరించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వార్డు సచివాలయాల్లో వివిధ సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన అర్హులైన జాబితాతో పాటు అనర్హులైన లబ్ధి పొందని జాబితాను ఖచ్చితంగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి వార్డు వాలంటీర్ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలందరికీ వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయా వార్డ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సచివాలయంలో సేవలు 150 రకాల సేవలు అందించాలని తెలిపారు. వివిధ వార్డుల్లో ఉన్న సంక్షేమ అసిస్టెంట్లు, మహిళ పోలీసులు ఖచ్చితంగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను తనిఖీలు చేయాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలో కులం, ఆదాయం, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గహ నిర్మాణ పనులలో పురోగతి సాధించాలని ఇంజినీర్ అసిస్టెంట్లను ఆదేశించారు.

ఓపీఎస్ కోసం ధర్మస్థలిలో సంకల్పదీక్ష : యుటిఎఫ్

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఫిబ్రవరి 3వ తేదీన కష్ణా జిల్లా గన్నవరం ధర్మస్థలి ప్రాంగణంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంకల్పదీక్ష సభను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర తెలిపారు. మంగళవారం యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ద్యోగులు, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సిందే అన్నారు. ఓపీఎస్ తప్పా మరొక ప్రత్యామ్నాయం లేదన్నారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జిపిఎస్ విధానం వల్ల సిపిఎస్ విధానంలో కంటే కొద్ది పాటి ప్రయోజనాలు మాత్రమే వనగూరుతాయని తెలిపారు. ఉద్యోగులకు ఉద్యోగవిరమణ అనంతరం భద్రత కలిగించేవిగా లేవని, రెగ్యులర్ ఉద్యోగాల కల్పన తగ్గడం వలన రాష్ట్ర ప్రభుత్వానికి పాత పెన్షన్ విధానం వల్ల పెద్దగా పడే భారంకూడా లేదని సూచించారు. ఈ నేపథ్యంలో గ్యారెంటెడ్ పెన్షన్ విధానం ఆలోచన విరమించు కోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఫిబ్రవరి 3న నిర్వహించే ధర్మస్థలి దీక్షకు ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, ఉపాధ్యక్షులు బాబు, సీతామహలక్ష్మి, కోశాధికారి సుధాకర్, రాష్ట్ర కౌన్సిలర్ మారుతీ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు తాహిర్ వలి, నారాయణ స్వామి, శ్రీనివాసులు, హరికష్ణ, రమీజ, ఆడిట్ కన్వీనర్ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఆహ్వానం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జూనియర్ సాఫ్ట్ వేర్ డెవలపర్ అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులు నిరుద్యోగుల కోసం ప్రారంభిస్తున్నామని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి షేక్ అబ్దుల్, జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ సిడాఫ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కోర్సులకు బుక్కపట్నం లోని డిగ్రీ కళాశాలలో , స్కిల్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కోర్సులకు ఇంటర్ పాస్, డిగ్రీ ఆ పైన చదివిన యువతీయుకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ అనంతరం వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 9640899337 కు లేదా నేరుగా బుక్కపట్నం లోని స్కిల్ హబ్ లో సంప్రదించాలని కోరారు.



ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీల్లో చిలమత్తూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చిలమత్తూరు

తిరుపతిలో ఈ నెల 28 నుండి 30 వరుకు స్కూల్ గేమ్స్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ - 19 రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీల్లో చిలమత్తూరు విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీంలో పాల్గొన్న జి. విద్యాశ్రీ 4 గోల్స్ వేసి మొదటి స్థానంలో నిలవగా, కడపలో జరిగిన పుట్ బాల్ పోటీలలో కెఎస్ సానియా అండర్ 17 విభాగంలో ఆడీ 3 స్థానంలో నిలిచిందని మండల ఆర్డీటీ కోచ్, గో గ్రీన్ నిర్వహకుడు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభా విద్యార్థినులను పుట్‌బాల్ అసోషియేషన్ సభ్యులు పీడీ లోకేశ్వరి, వెంకటేశులు, రాంమూర్తి, సనావుల్లా, విజయ్ కుమార్, రంగారెడ్డి తదితరులు అభినందించారు.

దళితవాడకు రోడ్డు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం 2వ వార్డు పరిధిలోని చౌడేశ్వరి కాలనీ దళిత వాడకు వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడంతో నేడు దళిత వాడలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దళిత వాడలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నారాయణప్ప, సుగూరు గోపాలప్ప తదితరులు పాల్గొన్నారు.



సమస్యను కమిషనర్‌కు వివరిస్తున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, తదితరులు

చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా చర్యలు తీసుకోవాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, గుట్కా, పేకాట, చోరీలపై ప్రత్యేక నిఘా పెంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే పిటీషనర్స్ పట్ల మర్యాదగా వ్యవహరించి త్వరితగతిన వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను కట్టడి చేయడంతో పాటు ఈ నేరాల్లో వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫోక్సో, తదితర కేసుల్లో అలసత్వం ఉండరాదన్నారు. ఈఏడాది జరిగిన గ్రేవ్ కేసులు అంతకు మునుపు పెండింగులో ఉన్న యుయుఐ కేసులు, ఫ్యాక్షన్ సంబంధిత కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులను సర్కిల్ వారీగా సమీక్ష చేశారు. చట్టాలు అనుసరించి మాత్రమే నిందితులను అరెస్టు చేయాలన్నారు. పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. ముఖ్యంగా ఇసుక జిల్లా దాటరాదని కర్నాటక మద్యం జిల్లాలోకి ప్రవేశించరాదని అన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టి కీలక కేసుల్లో ఘటనా స్థలంలోని ఆధారాలు సక్రమంగా, శాస్త్రీయ పద్ధతులలో సేకరించి దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలని,అప్పుడే నిందితులకు శిక్షలు పడే అవకాశముందని అన్నారు. ఈసమావేశంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కెవి. రామకృష్ణప్రసాద్, ఎస్‌బి డీఎస్పీ ఉమమహేశ్వర రెడ్డి, ఎస్‌బి సిఐ రవీందర్ రెడ్డి, సిఐ సుబ్బారావు, వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని పలువురు డీఎస్పీలు, పలువురు సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ, తదితరులు

ఆయారాం... గయారాం...



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

టీ, బిస్కెట్ తో ముగిసిన కదిరి మున్సిపల్ సమావేశం

చర్చకురాని ఆదాయాన్నిచ్చే మాస్టర్ ప్లాన్

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఆయారాం.. గయారాం... చందంగా కదిరి మున్సిపల్ సమావేశం ముగిసింది. ఏదో టీ, బిస్కెట్‌తో సమావేశం ముగిసిందని అధికార పార్టీ కౌన్సిలర్లే జోకులు వేసుకున్న సందర్భం కదిరి మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం హాల్లో చోటు చేసుకుంది. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసా అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపాలిటీ పరిధిలోని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు హాజరయ్యారు. ఒకరినొకరు పలకరించుకొని టీ బిస్కెట్ తీసుకున్నంత సమయంలోనే సమావేశం ముగిసిందని అందరూ బయటికి వెళ్లిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. సమావేశంలో పట్టణ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలి అనే అజెండా కూడా చర్చకు రాకుండా ఉండడం చూస్తుంటే పట్టణ అభివృద్ధిపై పాలకులకు ఏ మాత్రం శ్రద్ధ ఉందో అర్థమవుతోందన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. ప్రభుత్వానికి కదిరి మున్సిపాలిటీ ఆదాయాన్ని ఇచ్చే మాస్టర్ ప్లాన్ చర్చ కూడా జరగలేదు. వాటిని ముందుగానే ప్లాన్ చేసుకొని కాంట్రాక్టు పనులకు మాత్రమే తీర్మానించి మిగతా విషయాలన్నీ తీర్మానానికి పెట్టకుండానే సమావేశం ముగిసినట్లు ప్రకటించారు. మార్చి మొదటి వారంలో ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు, ఆలయ అభివృద్ధి, కోనేరు సమస్యలను సమావేశంలో ప్రస్తావించకపోవటం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. బ్రహ్మోత్సవాల గురించి అటు పాలకులు, ఇటు అధికారులు ప్రస్తావించకపోవటం గమనార్హం. 'వచ్చి పోవమ్మా..మెరుపుతీగ' అన్న చందాన సమావేశాలు ఎందుకు నిర్వహించాలని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సమావేశాలకు ప్రజాధనం దుర్వినియోగం చేయడంతో పాటు సమయం కూడా వృథానే అని వ్యాఖ్యానిస్తున్నారు. సమావేశం జరిగిన కొద్దిసేపు ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు.

రసాబాసగా కౌన్సిల్ మీట్



అధికార, ప్రతిపక్ష పార్టీల వాగ్వాదం

రూ.174.48 కోట్లతో బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను కనీస చర్చ సైతం జరపకుండా ఏక పక్షంగా రూ.174.48 కోట్లతో కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ అధ్యక్షతన రెండు సమావేశాలు జరిగాయి. తొలుత ప్రత్యేక సమావేశం నిర్వహించి బడ్జెట్‌పై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు అన్ని పద్దులతో కలిపి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. అయితే అంచనాలు, వాస్తవాలపై కౌన్సిలర్ నాగేంద్ర అభ్యంతరం తెలిపారు. బడ్జెట్ ప్రవేశ పెట్టిన వెంటనే టిడిపి ఫ్లోర్ లీడర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ బడ్జెట్ కేవలం అంకెల గారిడీలా ఉందని ఆరోపించారు. బడ్జెట్‌లో ఎమ్మెల్యే నిధుల కింద రూ.5లక్షలు వస్తున్నట్లు అంచనాలు వేశారని. దీనిని బడ్జెట్ నుంచి తొలగించాలని కోరారు. దీంతో టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. స్థానిక ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సహకారంతో నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం సాధారణ సమావేశం అంటు 30 అంశాలతో కూడిన మరో అజెండాను ప్రవేశ పెట్టారు. వీటిపై చర్చించి, 29వ అంశం మినహా అన్ని అంశాలకు అమోదం తెలిపారు. దీంతో పాటు మరో టేబుల్ అజెండాను అధికారులు కౌన్సిల్ దృష్టికి తీసుకోచ్చారు. దీనిని సైతం సభ్యులు అమోదం తెలిపారు. అనంతరం ప్రజా సమస్యలపై చర్చించారు. చివరకు ఒక అంశం మినహా అన్ని అంశాలతో పాటు బడ్జెట్ అజెండాను ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రకటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర రావు, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం : ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న హిందూపురం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావును మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామిరెడ్డితో పాటు కౌన్సిలర్లు కౌన్సిల్ హాలులో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మారుతీరెడ్డి, ఇర్షాద్, మద్దన జయరాములు, గిరీష్, షాజియా, సునీత పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు

హిందూపురం : ఆహార పదార్థాల వ్యాపారాలు చేసుకునే వారు తప్పని సరిగే ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామనిఆహార భద్రత అధికారిణి పి.తస్లీమ్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని పరిగి బస్టాండ్ లో కూల్ డ్రింక్ షాపులు, బేకరీలు, జనరల్ స్టోర్స్, టీ దుకాణాలు, గోబీ స్టాల్స్ తో పాటు ఆహార కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూల్ డ్రింక్స్ షాపుల్లో గడువు పూర్తి అయిన కూల్ డ్రింక్స్ ఉండడంతో వారికి నోటీసులు వచ్చారు. ఫ్రూట్‌మిక్స్ జూస్ అమ్మే వారు ఎక్కువ శాతం రసాయనిక పదార్థాలు కలపడాన్ని పరిశీలించి వాటిని ధ్వంసం చేయించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తనకల్లు : మండల పరిధిలోనినారేవారిపల్లి, గంగసానిపల్లి, చాపిరెడ్డిపల్లి, బండ్రేవారిపల్లి, తవళం గ్రామాలలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి, జెడ్పీ చైర్పర్సన్ గిరిజమ్మ పాల్గొన్నారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు వారికి ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అండర్-19 గెలుపుపై సంబరాలు

ధర్మవరం టౌన్ : ఇండియన్ మహిళలు అండర్-19 టీ 20 వరల్డ్ కప్ గెలుపుపై స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో మంగళవారం క్రికెట్ క్రీడాకారిణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణితో కలిసి క్రికెట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు వడ్డెబాలాజీ తదితరులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు శేషు, పృథ్వీ, ఆర్డీటీ క్రికెట్ కోచ్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న క్రీడాకారులు, తదితరులు

సిపిఎం మండల కమిటీ ఏర్పాటు

లేపాక్షి: మండల కేంద్రంలోని ఏపీ టూరిజం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండల కమిటీ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చిలమత్తూరు మండల నాయకులు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు వీల్‌చైర్లు వితరణ

ధర్మవరం టౌన్ : ధర్మవరం రైల్వేస్టేషన్‌కు దాతలు రెండు వీల్‌చైర్లను వితరణగా అందించారు. స్థానిక రైల్వేస్టేషన్లో టీటీఈ గా పనిచేసే ఉద్యోగ విరమణ చేస్తున్న వెంకట్రాముడును మంగళవారం స్టేషన్లో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ డిఎంఎం బాలాజీరెడ్, స్టేషన్ మేనేజర్ నరసింహనాయుడు, సిటిబిఐ ఇన్‌ఛార్జ్ జైపాల్ తదితరులు హాజరయ్యారు. అనంతరం రైల్వేస్టేషన్కు రెండు వీల్‌ఛైర్లను అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రిజిస్టర్ బాబు, ఆగ్రో టెక్ వెంకటేశ్వర్లు, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఓబులదేవరచెరువు : మండల పరిధిలో దాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న అక్కదేవతల ఆలయ అభివృద్ధికి, మహాశివరాత్రి వేడుకలు నిర్వహణకు పలువురు విరాళం అందజేశారు. పెద్ద కుర్మపల్లికి చిక్క నరసింహారెడ్డి,కొత్తచెరువు మండలానికి చెందిన చంద్రాయుడు, చిలమత్తూరు చెందిన చిన్నారి ప్రగతి,కదిరికి చెందిన షేక్ షేక్షావలి తమవంతుగా విరాళం అందజేశారు. ఈమొత్తాన్ని ఆలయ పూజారి వెంకటేష్ అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్లెల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరాటే, ఫెన్సింగ్ పోటీలకు కదిరి విద్యార్థులు

కదిరి టౌన్ : జాతీయ కరాటే, ఫెన్సింగ్ పోటీలకు కదిరి విద్యార్థులు 14 మంది అర్హత సాధించారని కరాటే మాస్టర్ షేక్షావలి తెలిపారు. 27,28, 29,30 తేదీన కర్నూల్, ఒంగోలులో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్ర చాంపియన్‌షిప్, కం సెలక్షన్స్‌కు హాజరైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సీనియర్ కరాటే మాస్టర్ డాక్టర్ మురళీకృష్ణ, ఆంజనేయులు , పాఠశాల నిర్వాహకులు అభినందనలు తెలిపారు .

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మడకశిర రూరల్ : కుష్టు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపిహెచ్ఇఒ సమీవుల్లా పేర్కొన్నారు. మంగళవారం రోళ్ల మండల పరిధిలోని రత్నగిరి హై స్కూల్ లో స్పర్శ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కుష్టు వ్యాధి పై అవగాహన కల్పించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, పిఇటి మోహన్, ఎంపిహెచ్ఇఒ ఖాదర్ వలి, ఎఎన్ఎం నాగరేఖ, ఎంఎల్‌హెచ్‌పి నలిని, హెల్త్ అసిస్టెంట్లు వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

తలుపుల : తలుపుల పంచాయతీ పరిధిలోని బండ్లపల్లి లో ఓబులేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపనకు ఉపసర్పంచి డికె బాబు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన రూ. 50వేల నగదును ఆలయ కమిటీసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బి సూర్యనారాయణ రెడ్డి, ప్రభువర్ధన్, శ్రీనాథ్, హరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయం ప్రారంభం

కదిరి టౌన్ : పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మించిన ఔషధ నియంత్రణ తనిఖీ అధికారి కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని జిల్లా ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మాణం చేసిన ఔషధ తనఖీ నియంత్రణ అధికారి కార్యాలయాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజనీ వర్చువల్ పద్దతిలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసుపత్రి మెడికల్ సుపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్, ఔషధ తనఖీ నియంత్రణ అధికారి హనుమన్న, మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి అనిల్, కోశాధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

పరిగి : పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిడిఎంహెచ్ఒ మంజువాణి మంగళవారం తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించిన ఆమె టీకాలు వేసే గది, లేబర్ రూమ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూపరెడ్డి, స్టాఫ్ నర్సు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ బియ్యం అందించాలి

ముదిగుబ్బ : లబ్ధిదారులకు సకాలంలో రేషన్ బియ్యాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిపి ఆదినారాయణ యాదవ్ సూచించారు. స్థానికఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ రేషన్ సరుకులు సకాలంలో లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలువురు సభ్యులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి కృష్ణమ్మ వెంకటరెడ్డితో పాటు ఎంపిటిసిలు, సర్పంచులు, ఎంపీడీవో విజయలక్ష్మి, జెడ్పీటీసీ తిరుమల బాయ్, ఎస్ఐ హేమంత్‌కుమార్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, తదితరులు

ధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాను విజవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ కోరారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. అంగన్వాడీలకు పనిభారం తగ్గించి, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్‌పి. శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి పి నరసింహప్ప, పట్టణ నాయకులు రామకృష్ణ, అత్తర్ బాబా, రఫిక్, జయప్ప, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి : సిపిఎం

పరిగి : మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సుమారు 42 ఇళ్లు కూల్చడానికి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఇళుకోల్పోయే బాధితులకు న్యాయం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన బాధితులతో కలసి మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్‌ను కలిశారు. రోడ్డు నిర్మాణ పనుల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. పలుకుబడి ఉన్న వారి ప్రహరీలను కూడా వదిలేసి నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇళ్లు కోల్పోయిన బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు నారాయణస్వామి శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యకార్మికులకు ఫేస్‌యాప్ రద్దు చేయాలి : సిఐటియు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

పారిశుధ్యకార్మికులకు పేస్‌యాప్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా నూతన హాజరు విధానాన్ని అమలు చేయడం సరికాదన్నారు. పారిశుధ్య కార్మికుల్లో అత్యధికమందికి స్మార్ట్ ఫోన్లకు సంబంధించిన నైపుణ్యత లేదని, చదువుకోని కార్మికులు కూడా ఉన్నారని అన్నారు. అలాంటి వారికి స్మార్ట్ ఫోన్లు లేవని వారు ఫేస్‌యాప్‌లో ఎలా హాజరువేస్తారని ప్రశ్నించారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తిప్పన్న, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, నరసింహులు , సూరి, శాంతమ్మ, గంగరత్నమ్మ, నరసమ్మ, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించకపోతే గుడ్‌విల్ వెనక్కివ్వండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయంలో వ్యాపారులకు, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు వెంటనే కల్పించడానికి సాధ్యం కాని పక్షంలో తాము చెల్లించిన గుడ్‌విల్‌ను వెనక్కి ఇవ్వాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నుంచి సభ్యులు బయటకు రాకుండ, కౌన్సిల్ హాలు మందు వ్యాపారులు బైటాయించారు. మార్కెట్ ముందు తోపుడు బండ్ల వ్యాపారులతో పాటు కూరగాయాల వ్యాపారులు మార్కెట్ దారిని ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో తాము ఇంత వరకు నూతన మార్కెట్‌లో వ్యాపారాలు ప్రారంభించలేక పోతున్నామన్నారు. వడ్డీలకు తీసుకోచ్చి గుడ్‌విల్ చెల్లించామనివడ్డీలు చెల్లించ లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ. మరో వారంలోగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కోవిడ్ సమయంలో వైద్య సిబ్బంది సేవలు ఆదర్శం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కోవిడ్ సమయంలో వైద్య సిబ్బంది అందించిన సేవలు ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా వైద్యాధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ క్యాలెండర్లు డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య, జిల్లా మలేరియా యూనిట్ అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, స్థానిక వైద్యుడు నాగరాజు నాయక్, అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ బాబు, ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎన్‌జిఒ నాయకులు లింగ రామ్మోహన్, వైద్య సిబ్బంది లక్ష్మి నరసమ్మ, అజీజ్ ఖాన్, శ్రీనివాసులు, పార్వతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలందించాలి

తలుపుల : రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణారెడ్డి వైద్యులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రతి వార్డును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. తదనంతరం వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. మాత శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మాతృ, శిశు మరణాలను జరగకుండా చూడాలని చెప్పారు. ఈసందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రఫీ నాయక్ డిఎంహెచ్ఒను సన్మానించారు. అనంతరం కెజిబివిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఐనుద్దీన్, మండల వైద్యాధికారి డాక్టర్ మున్వర్ బాషా, డాక్టర్ రోజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా వైద్యాధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కాలసముద్రం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విష జ్వరాలు సోకిన నేపథ్యంలో పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఐనుద్దీన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

దళిత రైతులకు అన్యాయం

చెన్నేకొత్తపల్లి : కింది స్థాయి రెవిన్యూ అధికారుల కుట్రతోనే నిజమైన దళిత రైతులకు అన్యాయం జరుగుతోందని ఎస్సీ, ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి విమర్శించారు. దళిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ సుబ్బలక్ష్మి, డిటి అనురాధకు వినతిపత్రాన్ని మంగళవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూచెన్నేకొత్తపల్లి గ్రామ పొలానికి చెందిన సర్వే 107-3లో 21సెంట్ల భూమినిఅక్రమంగా సంబంధం లేని వ్యక్తులకు అన్ లైన్ లో ఎక్కించి అధికారులు వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీలకు చెందిన భూములు సాధించు కోవడానికి ఎంతటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేకులకుంట రామాంజనేయులు, రామకృష్ణ, ప్రతాప్, చెన్నకేశవ, బాధితులు ఓబులేసు, ముత్యాలన్న, నారాయణ, మల్లి కార్జున, ఎర్రిస్వామి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రను జయప్రదం చేయండి

హిందూపురం : కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న నియోజక వర్గ హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ పార్టీలో ఆత్మస్థైర్యం కల్పించారన్నారు.ఇందులో భాగంగా ఈ నెల 3, 4, 5 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించి, జోడో యాత్రకు అనుసంధానంగా దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. అనంతరం స్థానిక రైతు బజార్ సమీపంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎఐసిసి సభ్యులు కెటి. శ్రీధర్, పట్టణాధ్యక్షులు శ్యామ్ కిరణ్, హరితమ్మ, రాధమ్మ, ఎన్ఎస్‌యుఐ సంపత్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పోటీ చేస్తా

పారిశ్రామిక వేత్త పుంగనూరు రామచంద్ర యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న పుంగనూరు రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తానే పోటీ చేస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త పుంగనూరు రామచంద్ర యాదవ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన మంగళవారం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి లో సాయి శ్రీనివాస ఫంక్షన్ హాలులో జిల్లా యాదవ సంఘం నాయకులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికలలో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయన్నారు. ఈ అరాచక, దౌర్జన్యాలకు చమర గీతం పాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పుంగనూరులో పెద్దిరెడ్డి అరాచకాలు మితిమీరి పరాకాష్టకు చేరాయన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే పుంగనూరులో పోటీ చేయాలని లేదా కుప్పంలో ఇద్దరు పోటీ చేద్దామా అంటూ పెద్దిరెడ్డి సవాల్ విసిరారని, అందుకు చంద్రబాబు అవసరం లేదని తానే పోటీ చేస్తానని అన్నారు. ఈ పోటీకి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్ధమా అని సవాల్ చేశారు. బడుగు బలహీన వర్గాలు 90 శాతం ఉన్నారని వారి ఓటు బ్యాంకు తోనే పార్టీలు గెలుస్తున్నాయని అన్నారు. అయితే ఆ వర్గాలకు చేసింది ఏమీ లేదన్నారు. ఏ పార్టీలో చేరుతారని విలేకరులు ప్రశ్నించగా రాష్ట్రమంతా పర్యటిస్తానని, ఏ పార్టీలో చేరేది ఇప్పుడే చెప్పలేనని 2024 ఎన్నికలలో మాత్రం రాష్ట్రం ముఖచిత్రమే రాజకీయంగా మారబోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జాతీయ కౌన్సిల్ సభ్యులు రాజశేఖర్ యాదవ్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రామకృష్ణ, సత్య సాయి జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, నాయకులు నారాయణస్వామి, చిన్నగాని నరసింహులు, బీసీ నాయకుడు సామకోటి ఆదినారాయణ, ఉమాపతి, రాజశేఖర్, వెంకటేష్, రామంజి, సాయి ప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రామచంద్ర యాదవ్‌కు సన్మానం

గోరంట్ల : మండలంలోని మల్లాపల్లి పంచాయతీ కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహులు యాదవ్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త పుంగనూరు రామచంద్ర యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కమనీయం... ఋషీంద్రుల కల్యాణోత్సవం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కెటీవీధిలోని శ్రీ మార్కెండేయస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై నిర్వహించిన, ఈ కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య, ఉపాధ్యక్షులు జింకా రామంజినేయులు, గోలి నాగభూషణ, ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బోడగల శంకర్, కోశాధికారి పొరాళ్ల పుల్లయ్య, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం వేలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, జయరాం రెడ్డి, పద్మశాలీయ బహుత్తమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల వద్ద బోర్డు ఏర్పాటు చేయాలి

గోరంట్ల : డీలర్లు తమ రేషన్‌దుకాణాల ముందు బోర్డు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ రంగనాయకులు, సిఎస్‌డిటి మనోహర్ ఆదేశించారు. స్థానికఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న తహశీల్దార్, సిఎస్‌డిటి మాట్లాడుతూ రేషన్ షాప్ డీలర్లు షాపుల వద్ద బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బోర్డులో రేషన్ షాప్ నంబర్ డీలర్ పేరు రాయాలన్నారు. ఈసందర్భంగా పలువురు డీలర్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సర్వర్ సమస్య వలన సకాలంలో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వలేకపోతున్నామన్నారు. డీలర్లకు కమిషన్ త్వరగా వచ్చే విధంగా చూడాలని కోరారు.



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న డీలర్లు

తహశీల్దార్‌కు సన్మానం : ఉత్తమ అధికారిగా కలెక్టర్‌నుంచి ప్రశంస పత్రాన్ని అందుకున్న స్థానిక తహశీల్దార్ రంగనాయకులును రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, డీలర్లు నరసింహారెడ్డి, ప్రతాప్ రెడ్డి, రంగారెడ్డి, హరినాథ్ రెడ్డి, చాందు, ఫారుక్, అశ్వర్థ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీ గోరంట్ల కోడూరు రోడ్డుపై లారీ, ద్విచక్రవాహణం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. నల్లచెరువు మండలం చౌటిరాల్లపల్లికి చెందిన కేదార్‌నాథ్‌రెడ్డి ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కేదార్‌నాథ్‌రెడ్డి ఎడమకాలు విరిగి రక్తగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని చిలమత్తూరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటి నిర్మాణంలో ఘర్షణ

బత్తలపల్లి : ఇల్లు నిర్మించుకునే విషయంలో అన్నదమ్ములు మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలపైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. మండలంలోని ఎం. చెర్లోపల్లి గ్రామానికి చెందిన చిత్రా గంగప్ప, ఓబిలేసు, లక్ష్మీనారాయణ అన్నదమ్ములు. వీరిలో గంగప్ప ఇంటి నిర్మాణానికి పునాది ఎత్తుగా కట్టుకున్నారు. ఇందులో తనకు కూడా వాటా ఉందని తమ్ముళ్లు ఘర్షణకు దిగారు. దీంతో ఒకరినొకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణ విషయంపై ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ : మండలం కేంద్రంలోని కెనరా బ్యాంక్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మంగళవారం సాయంత్రం రోడ్డు పక్కన ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా చేసే వ్యాన్ ఆగి ఉండగా అనంతపురం నుంచి కదిరి వైపు వేగంగా వెళుతున్న లారీ ఈ వ్యానును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ యజమాని శ్రీరాములు. వ్యాన్ వెనుక వైపున తాగునీరు పడుతున్న హోటల్ యజమాని అకీబ్ తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 సాయంతోకదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమంత్ కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి

రొద్దం : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న రొద్దం మండలానికి చెందిన వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అందుకు సంబందించిన వివరాలు.. మండలంలోని పెద్ద గువ్వలపల్లికి చెందిన బాబయ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన ప్రతి మూడు రోజులకోసారి హిందూపురం ఆసుపత్రికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కూడా హిందూపురం వెళ్లి తిరిగి సొంతగ్రామానికి ఆర్టీసీ బస్సులో బయలు దేరాడు. పరిగి మండలంలో ధనాపురం వద్ద రాగానే బాబయ్య గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

వైసిపి నాయకులపై పెట్టిన కేసులు కొట్టివేత

హిందూపురం : పురపాలక సంఘంలో 2015లో అప్పటి టిడిపి పాలక వర్గం వైసిపి నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు. గత 8 సంవత్సరాలుగా వారు కోర్టుల చుట్టు తిరిగారు. ఈనేపథ్యంలో అనంతపురం జిల్లా న్యాయమూర్తి మంగళవారం పూర్తి విచారణ జరిపి కేసును కొట్టివేస్తు తీర్పు చెప్పారు. దీంతో కేసులో ఉన్న నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుపై ఇరుక్కుపోయిన లారీ

మడకశిర రూరల్ : గత వర్షాకాలంలో దెబ్బతిన్న మడకశిర పెనుగొండ ప్రధాన రహదారిలో కల్వర్టు మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆర్ అనంతపురం గేట్ సమీపంలో కరెంటు ఆఫీస్ వద్ద ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేశారు. అయితే ఆ దారి నాణ్యతగా లేకపోవటంతో వాహనాలు రోడ్డులో ఇరుక్కుపోతున్నాయి. దారిని సరిగా రోలింగ్ చేయకపోవడంతో మంగళవారం బియ్యంలోడుతో వెళ్తున్న లారీ ఇరుక్కుపోయింది. దీంతో బియ్యం బస్తాలను కిందకు దించి బయటకు లాగడానికి చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ దారి నాణ్యతగా వేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డులో ఇరుక్కుపోయిన బియ్యం లారీ

ఓంకారేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న కైలాసం పీఠాధిపతి

బత్తలపల్లి : మండల కేంద్రంలోనిశ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయాన్ని కైలాసం పీఠాధిపతి కైలాసగిరిస్వామి మంగళవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కేశవస్వామి ఆలయ ధర్మకర్త, ఎపి కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో సత్తాచాటిన 'యశోద' విద్యార్థిని

ధర్మవరం టౌన్ : నంద్యాలలో ఈనెల 28 నుంచి 31వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్ఎఫ్ త్రోబాల్ అండర్-14 విభాగంలో తమ పాఠశాల విద్యార్థిని సత్తాచాటినట్లు స్థానిక యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని పోషిత రాష్ట్రస్థాయి త్రోబాల్ అండర్-14 విభాగంలో అనంతపురంజట్టు తరపున ప్రాతినిధ్యం వహించి ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. ఈమేరకు మంగళవారం పాఠశాలలో డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపల్ అనూప్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్, అశోక్ తదితరులు పోషితను అభినందించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని ప్రధాన సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఏపీ మెప్మా ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు కోరారు. ఈ సందర్భంగా అధ్యక్షులు హాజీ ఖాదర్‌బాషా మాట్లాడుతూ. కదిరి పట్టణ జనాభా పెరిగిందన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. ప్రజల ఇబ్బందులను కష్టాలను గుర్తించి ప్రధాన సర్కిళ్లలో. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీ మెప్మా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు